## క్లుప్తంగా

### రేపు మండల సమావేశం

కుప్పం: మండల సర్వ సభ్య సమావేశం బుధవారం మండలం పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఖాదర్ బాషా తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

### ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



ఎంవీఐ సుప్రియ

పుంగనూరు: రాష్ట్ర ప్రభుత్వం సవరించిన మోటారు వాహనాల కొత్త చట్టం అమల్లోకి వచ్చిందని, రహదారి ట్రాఫిక్ నియమ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంవీఐ సుప్రియ తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ, మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులు, సంరక్షకులకు రూ.25 వేల జరిమానాతో పాటు మూడేళ్ల జైలుశిక్ష విధిస్తామన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే రూ.10 వేల జరిమానాతో పాటు 6 నెలలు జైలుశిక్ష పడుతుందని హెచ్చరించారు.

### ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ

చౌడేపల్లె: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా సుధాకర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఇక్కడే ఎంపీడీఓగా పనిచేస్తున్న ఈయన ఎన్నికల విధుల్లో భాగంగా నెల్లూరు జిల్లాకు బదిలీపై వెళ్లారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు తిరిగి చౌడేపల్లె ఎంపీడీఓగా వచ్చారు.

### ముమ్మరంగా పారిశుధ్య పనులు



కమ్మనపల్లెలో మురుగు కాలువలు శుభ్రం చేస్తున్న కార్మికులు

బైరెడ్డిపల్లె: మండలంలోని కమ్మనపల్లె సచివాలయ పరిధిలోని గ్రామాల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులకు శ్రీకారం చుట్టినట్లు సర్పంచ్ రాజప్ప తెలిపారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు దోమలు విజృంభిస్తుండడంతో రోగాలు ప్రబలకుండా ఉండేందుకు మురుగునీటి కాలువలు శుభ్రం చేసి క్లోరినేషన్ చేస్తున్నామన్నారు. తాగునీటి ట్యాంకుల్లో కలుషిత నీరు సరఫరా కాకుండా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.

### మాదకద్రవ్య రహిత పంచాయతీగా తీర్చిదిద్దుదాం



ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగస్తులు, గ్రామస్తులు

పెద్దపంజాణి: కోగిలేరును మాదకద్రవ్య రహిత పంచాయతీగా తీర్చిదిద్దుతామని సర్పంచ్ రమేష్‌బాబు సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులతో సోమవారం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు నజీర్ బాషా, వనజ, నరేష్, తేజస్విని, గ్రామస్తులు శివశంకర్‌రెడ్డి, మంజునాథ్, దేవిరెడ్డి, రఘు తదితరులు పాల్గొన్నారు.

### ప్రణాళికతోనే గ్రామాల అభివృద్ధి

బంగారుపాళెం: గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికతోనే సాధ్యమని ఎంపీడీఓ శివశంకర్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో సోమవారం గ్రామ పంచాయతీల అభివృద్ధిపై సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేసినప్పుడే గ్రామాలు అన్ని విధాలా అభివృద్ధి చెందుతాయన్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి వచ్చే వివిధ గ్రాంట్లను అభివృద్ధి పనులకు ఉపయోగించుకునే విధానం, పంచాయతీరాజ్ కార్యాచరణ ప్రణాళిక అంశాలపై వివరించారు.

### బోరు సరే.. విద్యుత్ కనెక్షనేదీ?



జోగిండ్లులో నిరుపయోగంగా ఉన్న బోరు

బైరెడ్డిపల్లె: బోరులో నీరు పుష్కలంగా ఉన్నా తమ గ్రామంలో తాగునీటి సమస్య నెలకొందని మండలంలోని కమ్మనపల్లె సచివాలయ పరిధిలోని జోగిండ్లు గ్రామస్తులు వాపోతున్నారు. ఇక్కడ గ్రామంలో 12 ఎస్సీ గృహాలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో బోరు వేసి మోటారు అమర్చారు. విద్యుత్ కనెక్షన్ ఇంతవరకు ఇవ్వకపోవడంతో సమీపంలోని రైతు వ్యవసాయ బోరుకు ఏర్పాటు చేసిన విద్యుత్ కనెక్షన్‌తో కొంత కాలం నీటిని అందించారు. అయితే ఆ రైతు విద్యుత్ కనెక్షన్ తీసివేయడంతో నీటి సమస్య ఏర్పడింది. ఉన్నతాధికారులు స్పందించి తమ గ్రామానికి వేసిన బోరు మోటారుకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# అక్రమ క్వారీని సీజ్ చేయండి

- క్వారీకి, జనార్థన్ నాయుడికి సంబంధమే లేదు
- టీడీపీ అధికారంలో ఉందనే క్వారీ పనులు
- మైనింగ్ అధికారులు ఎందుకు పట్టించుకోలేదు?
- లీజుదారు కరెంట్ డీసీ చేయమన్నా ఎందుకు చేయలేదు?
- మైనింగ్ ఏడీ, ట్రాన్స్‌కో ఏడీ కార్యాలయాల వద్ద వైఎస్సార్ సీపీ ధర్నా
- వినతిపత్రాలు తీసుకోవడానికి ముఖం చాటేసిన అధికారులు



ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పలమనేరు: ఓ కార్మికుని ప్రాణం పోయేందుకు కారణమైన మాదిగబండ అక్రమ క్వారీని వెంటనే సీజ్ చేయాలని, అక్కడ అధికార పార్టీ అండతో పెట్రేగుతున్న జనార్దన్‌నాయుడుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం మైనింగ్, ట్రాన్స్‌కో కార్యాలయాల వద్ద ధర్నా, ఆందోళన చేశారు. రూరల్ మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాలాజీనాయుడు, నాయకులు విశ్వనాథరెడ్డి, ప్రహ్లాద, చెంగారెడ్డి మాట్లాడారు. కర్ణాటక రాష్ట్రం కేజీఎఫ్ సమీపంలోని దొడ్డకంబలి గ్రామానికి చెందిన జనార్దన్ నాయుడుకి, ఇక్కడి క్వారీతో సంబంధమే లేదన్నారు. వీ.కోట మండలానికి చెందిన శరత్‌కుమార్ లీజుదారుడిగా ఉన్నారన్నారు. ఈ జనార్దన్‌నాయుడు కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురం మండలం కెనమాకులపల్లెలో ఉన్నట్టు ఓ ఆధార్, ఆయన సొంత గ్రామంలో మరో ఆధార్ ఒకే నంబరుతో పొందాడని చూపించారు. అక్కడ వడ్డీ వ్యాపారం చేస్తూ



ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేస్తున్న కొలమాసనపల్లె సర్పంచ్ తదితరులు

పేదలను రక్తాన్ని పీల్చుతున్నాడని ఆరోపించారు. అమాయకులపై ఎన్నో కేసులు పెట్టాడని తెలిపారు. అలాంటి వ్యక్తి ఏపీలో కూటమి అధికారంలోకి రాగానే ఇక్కడి క్వారీని బలవంతంగా స్వాధీనం చేసుకున్నాడన్నారు. అక్కడున్న వేలాది లోడ్ల జల్లిని అమ్ముకోవడంతో దీనిపై లీజుదారుడు గత జూన్‌లోనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. మాదిగబండ లీజు గడువు పూర్తవడంతో ఇన్ ఎలిజిబిలిటీ జాబితాలో స్థానిక మైనింగ్ అధికారులు లీజుదారుకు నోటీసులు సైతం ఇచ్చారన్నారు. దీంతో ఆయన జూన్ 6న స్థానిక ట్రాన్స్‌కో అధికారులకు సైతం తన క్వారీకి కరెంట్ డీసీ చేయాలని వినతపత్రాన్ని ఇచ్చాడని ఆధారాలతో సహా చూపెట్టారు. మైనింగ్, ట్రాన్స్‌కో అధికారులు మైనింగ్‌పై చర్యలు తీసుకోకపోవడం వల్లే ఓ ప్రాణం పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి కారణమై అక్రమంగా క్వారీ నడుపుతున్న జనార్దన్ నాయుడుపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మెయిన్ రోడ్డులోని ట్రాన్స్‌కో ఏడీ కార్యాలయం వద్ద రోడ్డుపై ధర్నా చేసి క్వారీకి కరెంట్ కట్ చేయాలంటూ నినాదాలు చేశారు. ఆపై వినతిపత్రం ఇవ్వాలని చూస్తే అప్పటిదాకా అక్కడే ఉన్న ఏడీ కనిపించలేదు. మైనింగ్ కార్యాలయంలో ఏడీ అందుబాటులో లేరు. దీంతో ఈ రెండు కార్యాలయాల్లోనూ సిబ్బందికి కొలమాసనపల్లె సర్పంచ్ గోవిందస్వామి, ఉప సర్పంచ్ నరసింహారెడ్డి, ఎంపీటీసీలు వినతిపత్రాలను అందజేశారు. మూడు రోజుల్లో క్వారీ సీజ్ చేయని పక్షంలో తామే క్వారీ పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు. ధర్నా, ఆందోళనలో మున్సిపల్ కౌన్సిలర్లు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇసుక తవ్వకాల్లో టీడీపీ నేతల జోరు



కౌండిన్య నదిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు చేస్తున్న జేసీబీ, ట్రాక్టర్

- కౌండిన్య నదిలో రెవెన్యూ, పోలీస్ శాఖ దాడులు
- జేసీబీలు, ట్రాక్టర్లు సీజ్
- తహసీల్దార్ కార్యాలయానికి తరలింపు
- అధికారులతో టీడీపీ నేతల మంతనాలు
- జరిమానా లేకుండా వాహనాలను తీసుకెళ్లిన టీడీపీ నేతలు!



ఇసుక తవ్వకాలకు వినియోగించిన జేసీబీని సీజ్ చేసిన అధికారులు

గంగవరం: తెలుగుదేశం పార్టీ నాయకులు అక్రమంగా ఇసుక తోడుతున్న రెండు జేసీబీలు, ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గంగవరం పోలీసులు సోమవారం మధ్యాహ్నం సీజ్ చేశారు. వివరాలు..ఎలాంటి అనుమతులు లేకుండా కౌండిన్య నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్టు రెవెన్యూ అధికారులకు సమాచారం అందడంతో పోలీసులు, రెవెన్యూ సిబ్బంది కలిసి మండలంలోని తమ్మిరెడ్డిపల్లె వద్ద కౌండిన్య నదిలో దాడులు చేశారు. ఇసుక తవ్వుతున్న వాహనాలను సీజ్ చేసి తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. అప్పటికి సమయం సాయంత్రం 4 గంటలైంది. ఆ తర్వాతే అసలు కథ మొదలైంది. వాహనాలకు ఎలాంటి జరిమానాలు లేకుండా వాటిని తీసుకెళ్లేందుకు రెవెన్యూ అధికారులతో టీడీపీ నేతలు మంతనాలు సాగించారు. సీన్ కట్ చేస్తే- సీజ్ చేసిన వాహనాలను ఎలాంటి జరిమానా విధించకుండా సాయంత్రం 6 గంటలకు వదిలేశారు. ఇది చర్చనీయాంశమైంది. వాస్తవానికి రూ.5వేల నుంచి రూ.10వేల వరకు జరిమానా విధించాల్సి ఉంది.

## సంఘమిత్రలను తొలగించాలని నేతల ఒత్తిళ్లు

- న్యాయం చేయాలని కడా పీడీకి బాధితుల వినతి



కడా పీడీకి ఫిర్యాదు చేస్తున్న గుడుపల్లె మండల సంఘమిత్రలు

కుప్పం: స్థానికంగా ఉన్న అధికార పార్టీ నాయకులు తమను తొలగించాలని ఒత్తిడి చేస్తున్నారని, న్యాయం చేసి తమను ఆదుకోవాలని పలువురు గుడుపల్లె మండల సంఘమిత్రలు కడా ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్‌ను కోరారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని కడా పీడీ నిర్వహించారు. నియోజకవర్గ స్థాయిలో 52 ఫిర్యాదులు అందాయి. వీటిలో 26 అర్జీలు రెవెన్యూ శాఖకు సంబందించినవే. అలాగే, సంఘమిత్రలు సైతం నేతల ఒత్తిళ్లపై వినతి పత్రం ఇచ్చిన తమ గోడు నివేదించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ, నియోజకవర్గంలో పనిచేసే అధికారుల్లో మార్పు రావాలన్నారు. ప్రతి ఫిర్యాదునూ సంబంధిత అధికారులు పరిశీలించి పరిష్కరించాలని, కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించుకునే పరిస్థితి ఉండరాదన్నారు.15 రోజులకోసారి మూడు గ్రామాల్లో అధికార యంత్రాంగం పర్యటించాలని, మొత్తంగా నియోజకవర్గంలో 200 గ్రామాల్లో పూర్తి స్థాయిలో పర్యటించేలా ప్రణాళికతో ప్రజా సమస్యలపై దృష్టి సారించాలన్నారు.

### మొక్కలు నాటారు



మొక్కలు నాటుతున్న హెచ్ఎం దామోదరం

వి.కోట: మొక్కలు నాటి, వాటిని సంరక్షించి, పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని స్థానిక బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం దామోదరం కోరారు. సోమవారం బాలికోన్నత పాఠశాల ఆవరణలో పలు మొక్కలను నాటారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### కస్తూర్బా విద్యాలయాల తనిఖీ



ఆహార వివరాల పట్టికను పరిశీలిస్తున్న జడ్జి

గంగవరం: గంగవరం, బైరెడ్డిపల్లె మండలాల్లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలను పలమనేరు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి లిఖిత సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రాష్ట్ర లీగల్ సరీ్వసెస్ అథారిటీ ఆదేశాల మేరకు వీటిని తనిఖీ చేశారు. విద్యార్థినులకు వసతి, ఆహార పదార్థాలు, మరుగుదొడ్లు, వైద్య సదుపాయాలు, పరిశుభ్రత, వంటశాల, స్టాక్ రూంలో సరుకులు పరిశీలించారు. సమస్యలపై విద్యార్థినులను ఆరా తీశారు. భద్రత ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలుంటే నిర్భయంగా చెప్పాలని, లోపాలు ఉన్నట్లు తేలితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎల్. భాస్కర్, ఆరీఫుల్లాఖాన్, రంజిత్, పోలీసులు పాల్గొన్నారు.

## ఘనంగా తిరంగా ర్యాలీ



మోటారుసైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న జాతీయ జెండా కమిటీ సభ్యులు

పుంగనూరు: 78వ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని జాతీయ జెండా కమిటీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ ఘనంగా నిర్వహించారు. జాతీయ పతాకంపై అవగాహన కల్పించడానికి, ప్రజల్లో దేశభక్తి ఉద్దీపనం చేయడానికి పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. సాయి లోకేష్, రాజారెడ్డి, గన్ను మదన్‌మోహన్, లోకేష్, త్రిమూర్తిరెడ్డి, హరిప్రసాద్, బాలసుబ్రమణ్యం, లక్ష్మణరాజు, శరణ్‌కుమార్, కేశవరెడ్డి, నానబాల గణేష్, ముత్యాలు, భాస్కర్‌జెట్టి పాల్గొన్నారు.

### ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సమావేశం నిర్వహించాలి

పుంగనూరు: ఎస్సీ, ఎస్టీల సమస్యలు పరిష్కరించేందుకు ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సమావేశం నిర్వహించాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి ఎన్ఆర్.అశోక్ కోరారు. సోమవారం తహసీల్దార్ రామును కలిసి ఆయన సమస్యలు నివేదించారు. కార్యక్రమంలో నాగరాజు, భాస్కర్, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

### 'డయల్ యువర్ డీఎం'కు రెండు వినతులు

పుంగనూరు: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి రెండు వినతులు అందాయని డిపో మేనేజర్ సుధాకరయ్య తెలిపారు. పుంగనూరు నుంచి సదుం, కల్లూరు, పీలేరు, తిరుపతి, నెల్లూరు మీదుగా విజయవాడకు బస్సు సర్వీసులు నడపాలని, ఆర్టీసీ బస్సు రిజిస్ట్రేషన్ నంబర్లు బస్సు లోపల కూడా వేయాలని వినతులు వచ్చినట్లు తెలిపారు.

## 'ఈ-వాహన్ సేవై' యాప్‌తో ఉపయోగం



జీలుబాయ్‌ను సన్మానిస్తున్న సౌత్ ఇండియా లారీవర్కర్స్ యూనియన్

పలమనేరు: పట్టణానికి చెందిన లారీ వర్కర్ల అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు జీలుబాయ్ తమిళనాడులోని కన్యాకుమారి సమీపంలోని కోవిల్‌పట్టిలో జరిగిన సౌత్ ఇండియా లారీ వర్కర్స్ సమ్మిట్‌కు మన రాష్ట్రం తరఫున హాజరైనట్టు సోమవారం తెలిపారు. అక్కడ ఈ-వాహన్‌సేవై అనే యాప్‌ను లాంచ్ చేశారన్నారు. ఇందులో కార్మికులు సైతం తమ పేర్లను నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. డ్రైవర్ కమ్ ఓనర్లు, డ్రైవర్లు, క్లీనర్లకు ఈ యాప్‌తో ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. రాష్ట్రంలో కూడా ఈ విధానాన్ని అమలు చేసేందుకు రాష్ట్ర నాయకత్వంతో మాట్లాడనున్నట్టు ఆయన తెలిపారు. గత 14 ఏళ్లుగా మోటార్ ఫీల్డ్‌లో రంగంలో సేవలందిస్తున్న తనను అక్కడి నిర్వాహకులు సన్మానించారని ఆయన పేర్కొన్నారు.

### నిర్లక్ష్య వైద్యం.. పాడి ఆవు మృతి

వి.కోట: పశువైద్యాధికారుల నిర్లక్ష్యంతో రూ.80వేల విలువ చేసే పాడి ఆవు సోమవారం మృతి చెందిదని బాధిత రైతు వాపోయాడు. బాధిత రైతు కథనం.. ఎర్రంపల్లెలోని సురేష్‌కు చెందిన పాడి ఆవు అనారోగ్యం బారిన పడడంతో అతను బోడిగుట్లపల్లె పశువైద్యాధికారులకు సమాచారం ఇచ్చి ఆవుకు చికిత్స చేయాలని కోరాడు. అయితే సిబ్బంది ప్రైవేట్ వైద్యులను పంపి చికిత్స చేయించడంతో అది వికటించి ఆవు మరణించిందని ఆరోపించాడు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన పశువైద్యాధికారులపై చర్యలు తీసుకోవాలని కోరాడు.

## పంచాయతీరాజ్ చట్టంపై శిక్షణ



మాట్లాడుతున్న ఎంపీడీఓ అబ్దుల్ రహీమ్

పెద్దపంజాణి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీరాజ్ చట్టంపై మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ అబ్దుల్ రహీమ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీ విధులు-బాధ్యతలు, పారిశుధ్య నిర్వహణలో పంచాయతీల పాత్ర, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.రెడ్డెప్ప, పరిపాలనాధికారి భాస్కర్, ఈఓపీఆర్‌ఆర్డీ శారదాదేవి, శిక్షకులు విజయదత్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.



సదుం: శిక్షణ ఇస్తున్న నాగరాజు

#### సదుంలో..

సదుం: సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు ఇస్తున్న శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రాజశేఖర్ బాబు కోరారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి ఎంపీడీఓ మాట్లాడారు. శిక్షకుడు నాగరాజు(రొంపిచెర్ల పంచాయతీ కార్యదర్శి) ఆధ్వర్యంలో పంచాయతీ పరిపాలన, నిర్వహణ, వేస్ట్ మేనేజ్‌మెంట్, జీపీడీఎస్ సెక్యూరిటీ ప్రొసీజర్, వీధి దీపాలు, విద్యుత్ బిల్లుల నిర్వహణ..ఇత్యాది అంశాలపై ఇచ్చారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ వరప్రసాద్ పాల్గొన్నారు.

### వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

పుంగనూరు: వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలోకి చేర్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని వాల్మీకి సంఘ ఉపాధ్యక్షుడు అద్దాల నాగరాజ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆయన తహసీల్దార్ రాముకు వినతిపత్రం అందజేశారు. వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలనే డిమాండ్‌తో 60 ఏళ్లుగా పోరాటం చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఆయన కోరారు. కార్యక్రమంలో చౌడప్ప పాల్గొన్నారు.

### ఎస్టీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

పలమనేరు: పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఎస్టీఎఫ్ 25వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. జెండాను ఆవిష్కరించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గురుమూర్తి, కృష్ణమూర్తి, బాబు, బషీర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

## టీచర్ల సర్దుబాటును బహిష్కరించిన ఫ్యాప్టో



నిరసన వ్యక్తం చేస్తున్న ఫ్యాప్టో నేతలు

పలమనేరు: పలమనేరు డివిజన్ పరిధిలోని ఎంఆర్సీల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ అగమ్యగోచరంలా ఉండడంతో తాము బహిష్కరిస్తున్నట్టు స్థానిక ఫ్యాప్టో (ఫెడరేషన్ ఆఫ్ ఏపీ టీచర్స్ ఆర్గనైజేషన్) చైర్మన్ మునాఫ్ తెలిపారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ జీఓ నంబర్ 117,128 ప్రకారం కాకుండా జీఓ 53 ద్వారా ప్రభుత్వం టీచర్ల సర్దుబాటు చేయడం లోపభూయిష్టంగా ఉందన్నారు. దీనిపై ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసనలో నాయకులు లక్ష్మీనారాయణ, గురుమూర్తి, హేమచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ సిబ్బంది, కార్మికులకు వైద్య శిబిరం



శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి

పలమనేరు: మున్సిపాలిటీలోని అధికారులు, సిబ్బంది, శానిటేషన్ వర్కర్లకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ శిబిరం ఏర్పాటు చేశారు. తొలుత చైర్‌పర్సన్ వైద్య పరీక్షలు చేయించుకుని శిబిరాన్ని ప్రారంభించారు. వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలోమున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, మండీసుధా, మున్సిపల్ ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

### 16 నుంచి రెవెన్యూ సదస్సులు

రొంపిచెర్ల: మండలంలో ఈ నెల 16 నుంచి 28 వరకు గ్రామ రెవెన్యూ సదస్సులను నిర్వహించనున్నట్టు డీటీ లోకేష్ సోమవారం విలేకరులకు తెలిపారు. 16న బండకిందపల్లె, 17న పెద్దగొట్టిగల్లు, 19న బొమ్మయ్యగారిపల్లె, 20న రొంపిచెర్ల, 23న మోటుమల్లెల, 24న గానుగచింత, 27న పెద్దమల్లెల, 28న చిచ్చిలివారిపల్లె గ్రామాల్లో ఈ సదస్సులు నిర్వహిస్తామని వివరించారు. రైతులు 22-ఏ, ఇతర భూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కోరారు.

### సీఐ లింగప్పకు వీడ్కోలు సన్మానం




సీఐ దంపతులను సన్మానిస్తున్న పోలీస్ సిబ్బంది

వి.కోట: అర్బన్ సీఐ లింగప్పకు సోమవారం వీడ్కోలు సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో పోలీస్ సిబ్బంది ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పలువురు సీఐను సన్మానించి, ఆయన సేవలను ప్రస్తుతించారు. కార్యక్రమంలో పోలీసులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

## మన ఏనుగులను కాపాడుకుందాం

- కౌండిన్య అభయారణ్యంలో 124 గజరాజులు
- త్వరలో కర్ణాటక శిక్షణ ఏనుగులతో కట్టడికి కార్యాచరణ
- ప్రపంచ ఏనుగుల దినోత్సవంలో ఎఫ్ఆర్వో శివన్న



పలమనేరు అవగాహన ర్యాలీ చేస్తున్న అటవీ అధికారులు, పీపీఎస్ నిర్వాహకులు

పలమనేరు: కౌండిన్య అభయారణ్యంలోని ఏనుగులను కాపాడుకోవాల్సిన అవసరం అందరిపై ఉందని పలమనేరు ఎఫ్ఆర్వో శివన్న అన్నారు. ప్రపంచ ఏనుగుల దినోత్సవం పురస్కరించుకుని సోమవారం స్థానిక అటవీశాఖ, పలమనేరు పరిరక్షణ సమితి విద్యార్థులతో ఏనుగులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అటవీశాఖలో విధుల పరంగా ఏనుగులతో మమేకమై ఉద్యోగ విరమణ చెందిన అధికారులను సన్మానించారు. ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం కౌండిన్యలో 124 ఏనుగులు గుంపులుగా సంచరిస్తున్నాయన్నారు. గత పదేళ్లలో వేటగాళ్ల కరెంట్‌కు, ప్రమాదవశాత్తు కరెంట్ తీగలడం..ఇత్యాది కారణాలతో 12 ఏనుగులు మృత్యువాత పడ్డాయని తెలిపారు. ఏనుగులకు రక్షణగా తమశాఖ ఎంతో ముందుచూపుతో వ్యవహరిస్తోందన్నారు. ఇక్కడ ఏనుగుల కారణంగా పంటలకు నష్టం, ప్రాణనష్టం సంభవించకుండా చర్యలు తీసుకునేందుకు కర్ణాటక నుంచి శిక్షణ పొందిన రెండు ఏనుగులను మొసలిమొడుగు వద్దకు త్వరలో తీసుకురానున్నట్టు వెల్లడించారు. వాటితో ఇక్కడున్న ఏనుగులను కట్టడి చేసి సమస్యలు లేకుండా చేయడానికి తమవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక ఫారెస్ట్ అధికారులు, సిబ్బంది, పీపీఎస్ నిర్వాహకులు పాల్గొన్నారు.